

వైఎస్సార్‌సీపీలో చేరిక

పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు సమక్షంలో బీజేపీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. 8లో



రబ్బరు సాగుకు ప్రోత్సాహం

మన్యంలో రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు ఐటీడీఏ చర్యలు తీసుకుంటోంది. దీనిపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు. 8లో



నేడు అష్టదళ పద్మారాధన

విశాఖ కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో నేడు అష్టదళ పద్మారాధన నిర్వ హించనున్నారు. 0891-2711725 ఫోన్ చేయవచ్చు.

న్యూస్‌రీల్

రేపు శ్రీశారదా పీఠానికి సీఎం వైఎస్ జగన్



ఏర్పాట్లపై స్వాత్మానందేంద్రతో చర్చిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం విశాఖ శ్రీశారదా పీఠాన్ని సందర్శించనున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో 11.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో చినముషిడివాడలోని శ్రీశారదా పీఠానికి 11.40 గంటలకు వస్తారు. పీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలతో కలిసి పీఠంలోని దేవతామూర్తులకు సీఎం జగన్ ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం 12.55కి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరం బయలుదేరుతారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చినముషిడివాడలోని శారదా పీఠాన్ని కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సోమవారం రాత్రి సందర్శించారు. స్వామీజీల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం సీఎం పర్యటన ఏర్పాట్లపై స్వాత్మానందేంద్రతో కలిసి సమీక్షించారు.

ఐటీడీఏ 'స్పందన'కు 49 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏలో పీవో సూరజ్‌గనోరే నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 49 అర్జీలు వచ్చాయి. వీటిలో భాగంగా కోట గ్రామంలో ఎత్తిపోతల పథకం కోసం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని సర్పంచ్ గరుజుల చిన్నిబాబు కోరాడు. కుందాడ గ్రామం నుంచి కడుమూరు, తుర్రుమామిడి గ్రామాలకు పది కిలోమీటర్ల మేర మెటల్ రోడ్డు నిర్మాణం చేయాలని గిరిజనులు విన్నవించారు. అడ్డతీగల మండలం డి.భీమవరంలో 2104లో వెలుగు ద్వారా మంజూరైన ఏడు మేకలు చనిపోయాయని, పరిహారం చెల్లించాలని నేరం సత్యవతి కోరారు. అడ్డతీగలలో 26 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి పట్టాలు మంజూరు చేయాలని పిట్ట బాలురెడ్డి, పిట్ట కన్నారావు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు, డీడీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్త పాడేరు సబ్ సెంటర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

పాడేరు: మండలంలో మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని కొత్త పాడేరు ఆరోగ్య ఉప కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వైద్యాధికారి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల బృందం ఇక్కడ సబ్ సెంటర్‌ను సందర్శించి సౌకర్యాలు, నిర్వహణను పరిశీలించిందన్నారు. ఈ మేరకు జాతీయ హెల్త్ మిషన్ అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ ఎస్ఎస్ చాంగ్‌సన్ ప్రశంసాపత్రాన్ని జారీ చేశారన్నారు. దీంతోపాటు రూ.1,26,000 విడుదల చేశారన్నారు. ఈ నిధులతో సబ్ సెంటర్‌లో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన సీహెచ్‌వో దుర్గాభవాని, హెల్త్ అసిస్టెంట్ బి. ఎలిషారావు, ఏఎన్ఎం ఎం. విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు



పాడేరు ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. సాయంత్రం 5 గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డులో 12 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 13.5 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 14.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు సోమవారం నమోదయ్యాయి.

గిరిజన సేవలో...

- మన్యంలో పని చేయడం నా అదృష్టం
- నిత్యం అందుబాటులో ఉంటా..
- ప్రభుత్వ పథకాలు మరింత చేరువ చేస్తా
- రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తా
- అల్లూరి కొత్త కలెక్టర్ విజయ సునీత



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయసునీత



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న జేసీ భావన వశిష్ట, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

సాక్షి, పాడేరు: అల్లూరి సీతారామరాజు వంటి మహానుభావులు నడయాడిన నేలలో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని నూతన కలెక్టర్ విజయసునీత సంతోషం వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రెండో కలెక్టర్‌గా ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న విజయ సునీతను ఇక్కడ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇంతవరకు కలెక్టర్‌గా పనిచేసిన సుమిత్‌కుమార్‌ను పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేయడంతో ఆయన శనివారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్ మాట్లాడుతూ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యం కలిగిన మన్యంలో కలెక్టర్ విధులు గర్వంగా ఉందన్నారు. తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి పోస్టింగ్ కరీంనగర్ జిల్లాలోని ఆర్డీవోగా పని చేశానని, మారుమూల ప్రాంతంలో విధులతోనే తన కెరీర్ ప్రారంభమైందన్నారు. అలాంటి గ్రామీణ వాతావరణం నుంచి వచ్చిన తాను అల్లూరి జిల్లాకు తొలి మహిళా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం కూడా ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధికి దూరమైన గిరిజన ప్రాంతాల్లో పాలనను దగ్గర చేసి ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు తగ్గట్టుగానే సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేస్తానన్నారు. కొత్త జిల్లా ఏర్పాటు కావడంతో ప్రజలు స్వయంగా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను చెప్పుకునే అవకాశం వచ్చిందన్నారు. ఈ ప్రాంతంపై పూర్తిగా అవగాహన పెంచుకుని గత కలెక్టర్ కొనసాగించిన మార్గంలోనే తాను కూడా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అన్ని శాఖల అధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ప్రత్యేక కార్యాచరణ ద్వారా జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతానన్నారు. మొదటి పోస్టింగ్‌లోనే 2009లో ఎన్నికల విధులు నిర్వహించానని, ఆ అనుభవంతో రానున్న సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. పూర్తిగా మారుమూల ప్రాంతం కావడంతో ఇతర జిల్లాలకు భిన్నంగా ప్రత్యేకమైన కార్యాచరణ ప్రణాళిక అవసరమన్నారు. కమ్యూనికేషన్, రవాణా వ్యవస్థపై దృష్టి పెడతానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జేసీ భావన విశిష్ట, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పాల్గొన్నారు.

మోదకొండమ్మ తల్లికి పూజలు

కలెక్టర్ విజయసునీత తన కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని దర్శించుకున్నా రు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి సుబ్రహ్మణ్యం కలెక్టర్‌ను ఆశీర్వదించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, కొట్టగుల్లి రామారావు కలెక్టర్‌కు దుశ్శాలువా కప్పి అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించారు.

కలెక్టర్‌కు ఘన స్వాగతం

కలెక్టర్ విజయ సునీతకు కలెక్టరేట్‌లో ఘన స్వాగతం లభించింది. ఆమెకు జేసీ భావన వశిష్ట, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో లక్ష్మణమూర్తి, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి గోవిందరాజులు, ఇతర అధికారులు, కార్యాలయ ఉద్యోగులంతా పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మిలాన్‌కు పటిష్ట భద్రత

- 3,536 మందితో 18 సెక్టార్లుగా బందోబస్తు
- సందర్శనకు వచ్చే ప్రజల కోసం 4 పార్కింగ్ స్థలాలు
- ఈనెల 22 వరకు బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు



మాట్లాడుతున్న జాయింట్ సీపీ ఫకీరప్ప

విశాఖ సిటీ: మిలాన్-2024కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప చెప్పారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు జరగనున్న మిలాన్ 12వ ఎడిషన్‌లో 56 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. 20వ తేదీన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్, 21న ప్రముఖుల రాకపోకలు, 22న ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, గవర్నర్, భారత నావికాదళపతి మిలాన్ విన్యాసాలను తిలకించడానికి వస్తున్నట్లు వెల్లడించారు. మిలాన్ నిర్వహణ, ప్రము ఖుల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం 3,536 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఏడుగురు ఐపీఎస్ అధికారు లు, డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు ఇలా ఉన్నతాధికారులతో 18 సెక్టార్లుగా విభజించి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీఐపీలతో పాటు మిలాన్ సందర్శనకు వచ్చే ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 వరకు నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్‌హోటల్ వరకు వాహనాల రాకపోకలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లను వివరించారు.



బీచ్‌లో హెలిక్యాప్టర్ల విన్యాసం

నేవల్ పాసులు ఉన్న వారు

- నేవీ వేహికల్ పాసులు ఉన్న వారు తమ వాహనాలను సీఆర్‌రెడ్డి, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ మీదుగా ఏపీఐఐసీ గ్రౌండ్‌లో నిలపాలి. అక్కడి నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ మీదుగా బీచ్ రోడ్డులోకి వచ్చి కేటాయించిన ఎన్‌క్లోజర్ ద్వారా వెళ్లాలి.
- నేవల్ పాసులు ఉన్న వాహనదారులు సీఆర్ రెడ్డి సర్కిల్, ఏయూ అవుట్ గేట్ మీదుగా ఏయూ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి. అక్కడి నుంచి ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ రోడ్డు లేదా పార్క్ హోటల్ మీదుగా బీచ్ రోడ్డులోకి రావాలి.

సాధారణ వాహనదారులు

- సాధారణ, పాసులు లేని వాహనదారులకు నాలుగు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.
- రుషికొండ, ఎంవీపీ నుంచి బీచ్ రోడ్డులో వచ్చే వారు పార్క్ హోటల్ పక్కన ఉన్న ఎంజీఎం గ్రౌండ్‌లో వాహనాలు నిలిపాలి.
- పార్క్ హోటల్ నుంచి ఎటువంటి వాహనాలు బీచ్ రోడ్డులోకి అనుమతించరు.
- ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ జంక్షన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్, కేజీహెచ్ వైపు నుంచి వచ్చే సాధారణ వాహనదారులు జిల్లా పరిషత్ ప్రాంగణంలో గానీ, ఆంధ్రా మెడికల్ కాలేజ్ గ్రౌండ్‌లో గానీ, జూబ్లీ గ్రౌండ్(ద్విచక్ర వాహనాలు మాత్రమే)లో గాని పార్క్ చేసుకోవాలి. అక్కడి నుంచి కోస్టల్ బ్యాటరీ జంక్షన్ మీదుగా గోకుల్‌పార్క్ ద్వారా ఎన్‌క్లోజర్‌లోకి ప్రవేశించాలి.

కేజీహెచ్‌లో మరో ఐసీయూ పిల్లల వార్డు



రోగులతో మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో ఆధునిక వసతులతో మరో ఐసీయూ పిల్లల వార్డును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. సోమవారం అక్కడ వార్డు కన్వర్షన్ పనులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పరిశీలించి అధికారులు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. నవజాత శిశు అత్యవసర వైద్య విభాగంలో చేపట్టిన పునఃనిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా పనులు చేపట్టాలన్నారు. ఈ వార్డుతో పాటు పిల్లల వార్డుకు అవసరమైన అన్ని వైద్య పరికరాలను సిద్ధం చేయాలని, అవసరమైతే మరిన్ని నిధులను వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

చిన్నారికి అవసరమైన వైద్యాన్ని అందిస్తాం

కేజీహెచ్ రోగులతో కలెక్టర్ మాట్లాడారు. ఇక్కడ వైద్యం, వసతులపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి మండలం లంబసింగి గ్రామానికి చెందిన మారిన సత్యవతి తన ఏడాది కుమార్తె అయిన గౌరీశ్రీకి పుట్టుకతోనే కాళ్లు, చేతులు లేవని తన బిడ్డను ఆదుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన చిన్నారికి అవసరమైన పూర్తి వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

వలంటీర్లు ప్రభుత్వానికి కళ్లు, చెవులు

- చంద్రబాబువి బూటకపు హామీలు
- వలంటీర్లకు వందన కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సేవా వజ్ర, రత్న పొందిన వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ

కొయ్యూరు: ప్రభుత్వానికి కళ్లు, చెవులు వలంటీర్లని పాడేరు ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ సమన్వయ కర్త కె. భాగ్యలక్ష్మి అన్నారు. వారి సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా నిలిచారని ప్రశంసించారు. పార్టీ మండలాధ్యక్షుడు జల్ల బాబులు అధ్యక్షతన సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. పాడేరు నియోజకవర్గంలో 1,500 మందికి పైగా వలంటీర్లు ఉన్నారని, వీరు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. నేడు ప్రజలకు ఏమి కావాలన్నా వలంటీర్లను సంప్రదిస్తే సరిపోతుందన్నారు.

ప్రజలను మోసం చేయడానికే ఆరు హామీలు..

తమ ప్రభుత్వం ఏటా డీబీటీ ద్వారా రూ.75 వేల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తుందన్నారు. చంద్రబాబు తీసుకువచ్చే ఆరు హామీలకు ఏటా రూ.1.26 కోట్లు కావాలన్నారు. వాటిని ఎలా సమీకరిస్తారో చెప్పడం లేదన్నారు. నాడు ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతితో పాటు 600 హామీలను తుంగలో తొక్కినట్టే, నేడు ఆరు వాగ్దానాలను బుట్టదాఖలు చేయడం ఖాయమన్నారు. అనంతరం వలంటీర్లను ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, ఎంపీడీవో లాలం సీతయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి నూకరాజు, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, ఎంపీటీసీలు పొడుగు రత్నం, బీ అప్పారావు, సర్పంచ్‌లు సోమన్నదొర, గంగాభవానీ, సుర్ల చందు, త్రినాథ్ పడాల్, పీ శ్రీను, నూకాలమ్మలతో కలిసి ఆమె సత్కరించారు. సచివాలయ కన్వీనర్ సుధాకర్, బూదరాళ్ల కన్వీనర్ తిరుపతి పాల్గొన్నారు.

ఐఐఎంవీ నూతన శకం

విశాఖలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) శాశ్వత క్యాంపస్ మంగళవారం ప్రారంభం కానుంది. 241.50 ఎకరాల్లో అడుగడుగునా అద్భుతమనేలా గ్రీన్ బిల్డింగ్ నిర్మాణ శైలి, స్మార్ట్ టెక్నాలజీతో రూపుదిద్దుకున్న క్యాంపస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఢిల్లీకి చెందిన ఆర్కిటెక్చర్ సంస్థ రూపొందించిన డిజైన్‌తో రెండు దశల్లో క్యాంపస్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలిదశలో రూ.472 కోట్లతో నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం



- అడుగడుగునా అద్భుతంగా.. హార్వర్డ్‌ను మించేలా నిర్మాణం
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ, సీఎం జగన్



రాష్ట్ర విభజన బిల్లులో పొందుపరిచిన కేంద్ర విద్యా సంస్థల్లో ఒకటి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) విశాఖపట్నం. 2015 నుంచి ఏయూలో తాత్కాలికంగా కార్యకలాపాలు ప్రారంభం కాగా.. తక్కువ కాలంలోనే విద్యా రంగంలో తనదైన ముద్ర వేసింది. ఆనందపురం–గంభీరం పరిసర ప్రాంతాల్లో క్యాంపస్ నిర్మాణం ప్రారంభించారు. మొత్తం 62,350 చదరపు మీటర్ల విస్తీర్ణంలో బిల్టప్ ఏరియాను అభివృద్ధి చేశారు. ఆర్కాప్ అసోసియేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఢిల్లీ సంస్థ ఈ బిజినెస్ స్కూల్ ప్లాన్ రూపొందించింది. ప్రపంచ ప్రసిద్ధ హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని మించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇక్కడ నిర్మాణాల్లో మిళితం చేయడం విశేషం.

గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో నిర్మాణం

పర్యావరణహిత భవనంగా ఐఐఎం క్యాంపస్‌ను తీర్చిదిద్దారు. దేశంలోనే ప్రత్యేకంగా నిలిచేలా హైవే నుంచి క్యాంపస్ వరకు, క్యాంపస్ చుట్టూ 7,200 వివిధ రకాల చెట్లు, మొక్కలు నాటారు. ఈ స్థలం కొండల మధ్య ఉండటంతో.. నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాన నీటిని ఒడిసి పట్టేలా జల సంరక్షణ చర్యలు చేపట్టారు.

విభిన్న ప్రత్యేకతల సమాహారం

- క్యాంపస్‌లో అవసరాలకు కావాల్సిన దానికంటే అధికంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా 1,500 కిలో వాట్ల సామర్థ్యంతో ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 22.59 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది.
- హార్వర్డ్ విశ్వవిద్యాలయ నమూనాను ఆదర్శంగా తీసుకుని 'యు'ఆకారంలో కూర్చొనేలా తరగతి గదులు నిర్మించారు. 50 మంది, వంద మంది కూర్చొనేలా ఏసీ క్లాస్ రూంలు సిద్ధమయ్యాయి.
- వంద సీట్లు ఉన్న 10 క్లాస్ రూమ్‌లు, 50 సీట్లున్న క్లాస్‌రూమ్‌లు 10 నిర్మించారు. వీటికి అదనంగా మరో 5 తరగతి గదులు నిర్మించారు. ప్రొఫెసర్లకు 117 రూమ్స్ అవసరం కాగా.. ఇప్పటికే సగానికి పైగా పూర్తయ్యాయి.
- ప్రత్యేక తరగతులు చెప్పేందుకు దేశవిదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు 60 గదులతో కూడిన ఫైవ్‌స్టార్ హోటల్ పోలిన అతిథిగృహం ఏర్పాటు చేశారు.
- ప్రొఫెసర్లు పాఠాలు మొదలు పెట్టిన వెంటనే అత్యాధునిక సెన్సార్లు గ్రహించి.. స్పీకర్లు వాటంతట అవే ప్రారంభమయ్యేలా టెక్నాలజీ రూపొందించారు.



ఐఐఎంవీ - ముఖ్యాంశాలు

- 241.5 ఎకరాలను ఉచితంగా అందించిన రాష్ట్ర ప్రభుత్వం
- స్మార్ట్‌గా హరిత భవన నిర్మాణాలు
- రెండు దశల్లో రూ.807 కోట్లతో నిర్మాణానికి ప్రణాళికలు
- తొలిదశలో రూ.472 కోట్లతో భవనాలు, మౌలిక సౌకర్యాలు పూర్తి
- హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని మించే సాంకేతికతతో సొబగులు
- 1,500 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు
- 7,200 పూల, ఫల, వృక్షజాతుల పెంపకం
- వాన నీటి సంరక్షణ చర్యలతో క్యాంపస్ నిర్మాణం

అత్యున్నత ప్రమాణాలతో..



గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హ్యాబిటేట్ అసెస్మెంట్(గృహ) సిస్టం ద్వారా 5 స్టార్ రేటింగ్ సొంతం చేసుకునేలా ఐఐఎం కొత్త క్యాంపస్ నిర్మాణం తొలిదశ పూర్తయింది. రెండు ఫేజ్‌లలో మొత్తం రూ.807.69కోట్లతో క్యాంపస్‌ను నిర్మిస్తున్నాం. 1,170 మంది విద్యార్థులకుగాను మొదటి దశలో 600 మందికి వీలుగా అన్ని భవనాలు పూర్తయ్యాయి. పర్యావరణానికి అనుగుణంగా పచ్చదనం అభివృద్ధి చేశాం.

– ప్రొ.ఎం.చంద్రశేఖర్, ఐఐఎం, విశాఖపట్నం డైరెక్టర్

గంగవరం గిరిజన ఉత్పత్తులకు పురస్కారం

ఆది మహోత్సవంలో అభిమన్యు రైతు ఉత్పత్తిదారుల సంఘానికి ప్రథమ స్థానం



ఎగ్జిబిషన్‌లో అభిమన్యు సంఘం స్టాల్



పురస్కారం అందుకుంటున్న సంఘ సీఈవో సతీష్

గంగవరం: ఆది మహోత్సవ ఎగ్జిబిషన్‌లో గంగవరం గిరిజన ఉత్పత్తులకు పురస్కారం దక్కింది. ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు న్యూఢిల్లీ మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో అభిమన్యు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ తయారు చేసిన ఉత్పత్తులకు ప్రథమ స్థానం దక్కింది. ఈ వివరాలను ఆ సంఘ సీఈవో జి. సతీష్, చైర్మన్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ట్రైఫెడ్, ఎస్ఎఫ్ఏసీ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి 270కి పైగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు పాల్గొన్నాయన్నారు. అవి తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించాయన్నారు. వాటిలో గంగవరం మండలానికి చెందిన అభిమన్య రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ తయారు చేసిన జీడి పప్పు, హనీ మిక్స్ డ్రైఫ్రూట్స్, జీడి మామిడి ఆపిల్ జ్యూస్, జీడి మామిడి చిక్కీలు, జీడి మామిడి లడ్డూ ప్రదర్శనకు విశేష ఆదరణ లభించిందన్నారు. రుచితోపాటు సామాన్యులకు అందుబాటు ధరలో లభ్యం కావడం వల్ల మొదటి స్థానం దక్కిందన్నారు. ఇందులో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ బి.సునీల్‌కుమార్, జిల్లాకో ఆర్డినేటర్ ఓ. సతీష్ కృషి అభినందనీయమన్నారు. గంగవరం గిరిజన ఉత్పత్తులకు మొదటి స్థానం లభించడంపై ఈ ప్రాంత గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

అప్పన్నను దర్శించుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ దుప్పల వెంకటరమణ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరంపూజ నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు.

పోలీస్ విభాగ భవనాలు ప్రారంభం

విశాఖ సిటీ: నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో పునర్నిర్మించిన డాగ్ స్క్వాడ్, పోలీస్ హ్యాపీ హోమ్స్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ సమక్షంలో ఆయా విభాగాల ఆర్‌ఐల మీదుగా ప్రారంభించారు. సీపీ ఇటీవల పోలీస్ శాఖకు చెందిన అన్ని విభాగాల భవనాలను సందర్శించారు. అందులో డాగ్‌స్క్వాడ్, పోలీస్ సిబ్బంది డార్మిటరీలను మరింత ఆధునీకరించాలని గుర్తించారు. వాటిని ఆధునీకరించి సోమవారం పోలీస్ డాగ్ స్క్వాడ్ భవనాన్ని ఆర్ఐ(సీఎస్‌బీ) కె.రవికుమార్, పోలీస్ హ్యాపీ హోమ్స్‌ను ఆర్ఐ(క్యూఎం) పి.వెంకటేశం ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 వి.ఎన్.మణికంఠ, డీసీపీ(క్రైమ్) పి.వెంకటరత్నం, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఎస్.వెంకటరావు, ఏడీసీపీ(ఏఆర్) బి.నారాయణరావు, దిశా ఏసీపీ వివేకానంద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రబ్బరు సాగుకు ప్రోత్సాహం

ఏడీఏ దుర్గేష్

రంపచోడవరం: ఏజెన్సీలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ప్రోత్సాహంతో రబ్బరు సాగును ప్రోత్సాహించేందుకు చర్యలు తీసుకుంటామని హార్టి కల్చర్ సహాయ సంచాలకులు దుర్గేష్ (రబ్బరు ప్రాజెక్టు)అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఇందులో భాగంగా మారేడుమిల్లి మండలం పందిరిమామిడి కోట, పుజారిపాకలు గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు.

ఈ ప్రాంతంలో ఎంతో నాణ్యమైన రబ్బరు లభ్యమవుతుందన్నారు. రానున్న ఈ ప్రాంతంలో 500 హెక్టార్లల్లో రబ్బరు సాగు చేసేందుకు భూములను గుర్తించినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో కార్యాచరణ రూపొందించి రైతులతో రబ్బరు మొక్కలు నాటేందుకు అందజేస్తామన్నారు. రైతులకు అవసరమైన చోట రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

విన్యాసం.. సంభ్రమాశ్చర్యం

నేడు ఫైనల్స్ రిహార్సల్స్

బీచ్‌రోడ్డు: మిలాన్–2024లో భాగంగా నేవీ విన్యాసాల ప్రదర్శన, పరేడ్ రిహార్సల్స్ అదరహో అనిపించాయి. దేశ రక్షణ కోసం నేవీ చేపట్టే ఆపరేషన్లను కమాండోలు కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. ఉగ్రవాదులను తరిమికొట్టడం, ఆపదలో చిక్కుకున్న వారిని రక్షించడం వంటి ఆపరేషన్లు ఉత్కంఠగా సాగాయి. నేవీకి చెందిన ఆరుగురు కమాండోలు హెలికాప్టర్ నుంచి పారాచూట్ సాయంతో కిందకు దిగి అబ్బురపరిచారు. మిగ్ 29 కె, హాక్స్, ఫైటర్ జెట్స్, యుద్ధ విమానాలు, చేతక్‌లు, హెలికాప్టర్లను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అనంతరం దేశ, రాష్ట్ర రక్షణ బలగాలు పరేడ్ రిహార్సల్స్ చేపట్టాయి. మంగళవారం ఫైనల్ రిహార్సల్స్ జరగనుండగా.. విన్యాసాలను వీక్షించేందుకు నేవీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, ఇతర దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు.


దూసుకుపోతున్న మిగ్
సంద్రంలో బాంబుల మోత


బాధితులను రక్షిస్తున్న గార్డ్స్


పారాచూట్ విన్యాసాలు


జాతీయజెండాతో అభివాదం


ఎన్‌సీసీ క్యాడెట్స్ కవాతు


మిగ్ విమానాల విన్యాసాలు

ఇదీ.. నౌకాదళ 'సూర్య' ప్రతాపం

నింగీ నేలా ఏకం చేసేలా భారత నౌకాదళం సత్తా చాటుతోంది. భారత్, మిత్రదేశాలతో కలిసి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిలాన్–2024లో.. ప్రపంచానికి నౌకాదళ శౌర ప్రతాపాన్ని మరోసారి ప్రదర్శించనుంది. ఇందులో భాగంగా.. ఆర్కే బీచ్‌లో జరుగుతున్న రిహార్సల్స్‌లో నేవీలో కొత్తగా చేరిన సీహాక్స్ హెలికాప్టర్.. ఇలా సూర్యున్ని చీల్చుకుంటూ దూసుకుపోతూ.. అబ్బురపరిచింది.



భారతీయ కరెన్సీ కోసం..

బీచ్‌రోడ్డు: మిలాన్–24లో 50 దేశాలకు చెందినవారు పాల్గొంటున్నారు. ఈనేపథ్యంలో సోమవారం విదేశీయులంతా ఆర్కే బీచ్ వేదికగా జరిగిన నేవీ విన్యాసాల రిహార్సిల్స్ వీక్షించేందుకు తరలివచ్చారు. రిహార్సిల్స్ అయిన తరువాత భారతీయ కరెన్సీ కోసం బీచ్‌రోడ్డులోని ఇండియా ఒన్ ఏటీఎం వద్ద విదేశీయులు ఇలా క్యూ కట్టారు.



ఇండియా వన్ ఏటీఎం వద్ద క్యూ కట్టిన విదేశీయులు

బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

చింతపల్లి రూరల్: రాబోయే ఎన్నికల్లో జగనన్నను గెలిపించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తేనే మన భవిష్యత్ బాగుంటుందని పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలో బెన్నవరం పంచాయతీ పరిధిలో వట్టిభూసులు కాలనీ, గొచ్చపల్లి, జీలుగుమెట్ట, రేగళ్లు, బొంకుమామిడి, కొత్తవీధి, బి.కొత్తూరు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. జగనన్న ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బి.కొత్తూరు గ్రామానికి చెందిన బీజేపీ సభ్యులు వండలం చిన్నబ్బాయి, బోనంగి రమణ, ప్రసాద్, కవడం హరిబాబు, వి.శివ, కొర్ర భాస్కరరావు, కొరాబు రాంబాబు, కె.కరుణరావు, కె.చంటిబాబు, వి.విజయలక్ష్మి, కె.బాలన్న, తదితర 13 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి పార్టీ కండువా కప్పి విశ్వేశ్వరరాజు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలన చూసి వివిధ పార్టీల కేడర్ నేడు వైఎస్సార్‌సీపీలోకి చేరుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసికట్టుగా పోటీ చేసినా వైఎస్సార్‌సీపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. జగనన్న పాలనకు వస్తున్న ప్రజాదరణను చూసి టీడీపీ, జనసేన పార్టీలు ఓర్వలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గెమ్మిల సోని, సూపర్ సర్పంచ్ బచ్చలి బొజ్జన్నదొర, మాజీ వైస్ ఎంపీపీ కత్రి నాయుడు, అన్నవరం మాజీ సర్పంచ్ చిన్నబ్బాయి, నాయకులు కె.నాయుడు, ఎస్.గంగన్నపడల్, నాగేశ్వరరావు, సింగ్రు, లక్ష్మణరావు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

కలెక్టర్ విజయసునీతకు ఐటీడీఏ పీవో శుభాకాంక్షలు


కలెక్టర్ విజయసునీతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్


కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.విజయసునీతను పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఐటీడీఏ పరిధిలో చేపడుతున్న గిరిజనాభివృద్ధి, ఇతర సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు, భూ సేకరణ, రైతులకు చెల్లించిన పరిహారం, గిరిజన విద్య, వసతి గృహాల నిర్వహణ, అటవీ హక్కు పత్రాల పంపిణీ వంటి అంశాలన్నింటిని సమగ్రంగా వివరించారు. రానున్న ఎన్నికలకు సంబంధించి అరకులోయ నియోజకవర్గ పరిధిలో ముందస్తు చర్యలు, ఎన్నికల అధికారుల శిక్షణ తరగతులపైన సమీక్షించారు.


మోదకొండమ్మతల్లికి పూజలు చేస్తున్న కలెక్టర్ విజయ సునీత

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

పెదబయలు: గిరిజన చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని , యువత మంచి మార్గంలో నడుచుకోవాలని రూడకోట సీఆర్‌పీఎఫ్ ఔట్‌పోస్టు 198 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. రూడకోటలో సోమవారం నిర్వహించిన పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్ సామాజిక సేవల్లో భాగంగా ఏటా గిరిజన ప్రజలకు సేవలందిస్తామిని, ఏటా గిరిజనులకు ఉపయోగపడే పనులు, యువతకు ప్రోత్సహించే పనులు చేపడుతున్నామని ఫలితంగా ప్రజలకు, పోలీసులకు మైత్రీ బలపడిందన్నారు. దీంతో చాలా వరకు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించినట్టు చెప్పారు. గిరిజన యువత క్రీడల పట్ల నైపుణ్యం ఉందని వీరిలో ఉన్న ప్రతిభ వెలికి తీస్తే విజయం వైపు పరుగులు పెడతారనిన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల నుంచి ఆరు టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల్లో బురదకొండ ప్రథమ స్థానంలో నిలువగా కాంద్రంగి వలస ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేత జట్లకు ట్రోఫీ, వాలీబాల్, నెట్, టీషర్టులకు అందజేశారు ఎస్‌ఐ రవి కుమార్, వైద్యాధికారి సత్యారావు, హెచ్‌ఎం దేముడు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్

పోలీసుల అదుపులో గిరిజనుడు!

పాడేరు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న బాధితుడి భార్య


ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: స్థానిక సంతలో ఆదివారం తన భర్త సీందరి రామారావును పోలీసులు బలవంతంగా తీసుకుపోయారని బూదరాళ్ల పంచాయతీ నల్లబిల్లికి చెందిన అతడి భార్య లక్ష్మి వాపోయింది. ఈ విషయమై సోమవారం పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి మొరపెట్టుకుంది. తన భర్తకు ఎవరితోనూ ఎటువంటి సంబంధాలూ లేవని స్పష్టం చేసింది. తన భర్త సమాచారం చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఫోన్లో చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఏఎస్పీ విచారిస్తున్నారని, రామారావుకు ఏమి కాదని బాధితురాలికి ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

ప్రేరణ ఉద్యోగాలకు 10 మంది ఎంపిక

వై.రామవరం: నిరుద్యోగ గిరిజన మహిళల కోసం అల్లూరి జిల్లా పోలీసు యంత్రాంగం చేపెట్టిన ప్రేరణ కార్యక్రమం ద్వారా మండలం నుంచి 10 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ చెప్పారు. వారిలో ఏడుగురు మహిళలు ఉద్యోగాలకు వెళ్లినట్టు పేర్కొన్నారు. ప్రశాంతి ఎడ్యుకేషనల్ ఇనిస్ట్యూషన్ సహకారంతో బెంగులూరుకు చెందిన టాటా టెక్నాలజీ సంస్థ నందు శిక్షణ ఇచ్చి, ఉద్యోగం ఇస్తారని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, జీతం చెల్లిస్తారన్నారు. మండల లోతట్టు ప్రాంతాలైన జంగాలతోట గ్రామానికి చెందిన పల్లాల మంగమ్మ, చవిటిదిబ్బలుకు చెందిన భుదిరెడ్డి తులసి, యార్లగడ్డకు చెందిన కడబాల లక్ష్మీ ప్రశన్న కల్యాణి, చింతకర్ర పాలెం గ్రామానికి చెందిన చదల వెంకటలక్ష్మి, కోండ్ల వసంతకుమారి,కోండ్ల కామేశ్వరి, గాదె మౌనిక ఈఉద్యోగాలకు వెళ్ళినట్టు తెలిపారు.


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో ఎస్‌ఐ సంతోష్‌కుమార్

బాలికపై లైంగికదాడి

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గంగవరం: మండలంలోని గొరగొమ్మిలో బాలిక(10)పై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు అడ్డతీగల సీఐ రవికుమార్ సోమవారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గొరగొమ్మి (వెంకటరామాపురం) గ్రామానికి చెందిన అన్నిక జయరామ్ (30) తనకు చెల్లెల వరసైన బాలిక(10)ను దుంప తోటలోకి తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈమెకు తల్లి లేకపోవడంతో తన నాన్నమ్మ దగ్గరే ఉంటూ స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఆదివారం పాఠశాల సెలవు కావడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను తీసుకెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలికను వైద్య పరీక్షలకు పంపామని, నిందితుడు పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక రేపు

చింతూరు: ఈనెల 21న స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏడీఈ మలాకీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫోరం ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ వేదికలో చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలకు చెందిన వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

మోతుగూడెం: డొంకరాయి, మంగంపాడు, బచ్చులూరు, రాజు క్యాంపు గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 255 గడపలను వారు సందర్శించారు. డొంకరాయి గ్రామంలో రూ.65 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. పంచాయతీలో సుమారు రూ.15కోట్ల వరకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగనన్న అమలుచేస్తున్న గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. డొంకరాయి పరిధిలో సుమారు 750 మందికి పోడు భూమి పట్టాలు అందజేశామని, 290 మందికి గృహాలు నిర్మించినట్టు చెప్పారు. ఒక డొంకరాయి గ్రామంలోనే సుమారు రూ.5కోట్లతో పలు అభివృద్ధి పనులు తో పాటు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు.


గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి . ఎమ్మెల్సీ అనంతబాబు

నేడు వలంటీర్లకు సత్కారం

సాక్షి,పాడేరు: మండలంలోని వలంటీర్లకు ఉత్తమ పురస్కారాలతో సత్కార కార్యక్రమం మంగళవారం మోదకొండమ్మతల్లి ఆలయ కళ్యాణ మండపం ప్రాంగణంలో జరుగుతుందని పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం 3గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

శారదా సన్నిధిలో ఆధ్యాత్మిక పెన్నిధి

ఘనంగా ముగిసిన శారదాపీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి: శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు వైభవంగా ముగిశాయి. హోమాలు, కల్యాణాలు, పారాయన మహాయజ్ఞాల నడుమ శాస్త్రోక్తంగా సాగిన క్రతువు విశేషంగా ముగిసింది. ఆఖరిరోజు మహిషాసుర మర్ధిని అవతారంలో రాజశ్యామల అమ్మవారిని అలంకరించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. తొలుత వార్షిక హోమాలకు స్వయం జ్యోతి మండపంలో పూర్ణాహుతిలో నిర్వహించారు. అనంతరం యాగశాలలో మహరుద్ర సహిత రాజశ్యామల యాగానికి మహాపూర్ణాహుతి చేశారు. ప్రవచన కర్త విభీషణ శర్మకు ప్రవచన విశారద బిరుదును ప్రదానం చేశారు. పండిత ప్రముఖులు ముష్టి భీమశంకర శాస్త్రి, ముష్టి పురుషోత్తమశర్మ, ముక్కామల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును స్వామీజీ సత్కరించారు. ఆఖరి రోజు ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు పీఠం ప్రతినిధులు ప్రసాద వితరణ చేపట్టారు.


ప్రవచన కర్త విభీషణ శర్మకు ప్రవచన విశారద బిరుదు ప్రదానం చేస్తున్న స్వామీజీలు

పటిష్టంగా విశాఖ మ్యూజియం నిర్వహణ

కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: విశాఖ మ్యూజియం నిర్వహణ మరింత పటిష్టంగా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి సోమవారం విశాఖ మ్యూజియంను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిలాన్–2024కు వివిధ దేశాల ప్రతినిధులు విశాఖ విచ్చేస్తున్నారని, వారి సందర్శనార్థమై మ్యూజియంను ఆధునికీకరించినట్లు చెప్పారు. అనంతరం మరమ్మతులు చేపట్టిన మేరీటైమ్, హెరిటేజ్ మ్యూజియంను పరిశీలించారు. మ్యూజియంలో మంచి చిత్రాలు ఏర్పాటు చేయాలని అదనపు కమిషనర్‌కు కమిషనర్ సూచించారు. పురాతన విగ్రహాలు మరింత అందంగా కనిపించేందుకు ఫోక్ లైట్లను ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణరాజును, మ్యూజియం ఆవరణలో మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదర్‌ను, పురాతన వస్తువులు, విలువైన వస్తువులను నిత్యం గమనిస్తూ.. భద్రతా చర్యలు చేపట్టాలని క్యూరేటర్ రమణను ఆదేశించారు. అనంతరం పాండురంగాపురం సమీపం ఆఫీసర్స్ క్లబ్ పక్కన నిర్మాణంలో ఉన్న జీవీఎంసీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్‌ను ఆదేశించారు. ఈఈ రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కశింకోట విద్యార్థుల ప్రతిభ

కశింకోట: ఏపీ స్టేట్ డ్రాగన్ రియాన్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. వాడోకాయి కరాటే డు డ్రాగన్ రియాన్ కరాటే డు సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో రాజాంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు సిహెచ్.ధామేశ్వర్ అభిరాం సాయి, ఎ.లోహిత స్వర్ణ పతకాలు, కె.పునీత్, ఎ.ఆరాధ్య దీక్షిత వెండి పతకాలు గెలుపొందారు. వీరిని సోమవారం స్కూల్ ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.